మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహాచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

- గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

- మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్ 1: హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 1 : శ్రీరాంపూర్ ఏరియా భగత్‌సింగ్ హైస్కూల్ 1998-99 బ్యాచ్ విద్యార్థులు మంగళవారం నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్‌లో అ'పూర్వ'సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల(సిల్వర్‌జూబ్లీ) తర్వాత ఒకచోట చేరి ఆనందోత్సవాలతో సంబురాలు చేసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ గురువులను సన్మానించారు.

వృథాగా ఉన్న ఆర్‌వోఆర్ ప్లాంట్

వృథాగా ఆర్వోఆర్ ప్లాంట్

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 1 : నస్పూర్ కాలనీలోని ఆర్వోఆర్ ప్లాంటు పూర్తిగా అలంకార ప్రాయంగా మారిందని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నస్పూర్ కాలనీ షిర్కేలోని వాటర్ ప్లాంటులో సిలిండర్లు చెడిపోవడంతో నెలరోజులుగా మూసి ఉంటున్నదని పేర్కొన్నారు. నిర్వహణకు నోచుకోక వృథాగా మారిందని, కార్మిక కుటుంబాలకు శుద్ధజలాలు అందించడంలో యాజమాన్యం విఫలమైందని ఆరోపించారు. కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్నామని చెప్పడమే తప్ప అమలులో ఆ చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కాలనీల్లో నాణ్యమైన నీరు సరఫరా చేయాలని, టీడీఎస్ విలువలను నిర్వహిస్తూ సివిల్ ఇంజినీర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

రెబ్బెన, అక్టోబర్ 1 : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు, శారీరక దారుఢ్యం కలుగుతుందని గోలేటి డిస్పెన్సరీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ మురళీమోహన్ అన్నారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 91వ వార్షిక క్రీడల్లో భాగంగా బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి భీమన్న క్రీడామైదానంలో మంగళవారం డిపార్ట్‌మెంట్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న సీనియర్ మెడికల్ ఆఫీసర్ మురళీమోహన్

ప్రజా సంక్షేమానికి కృషి

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, సబ్ కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్ టౌన్/నస్పూర్, అక్టోబర్ 1 : ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పురపాలక శాఖ కార్యదర్శి దాన కిషోర్, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ హన్, విద్యుత్ నిర్వహణ కార్యదర్శి అరవింద్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, పంచాయతీ రాజ్, మున్సిపల్, పౌరసరఫరాల శాఖల అధికారులతో తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే, ఉడా ఏర్పాటు, అనుమతి లేని లే-అవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన, తదితర విషయాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలుపై అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి చేసి, అర్హత గల లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున తెలంగాణ డిజిటల్ ఫ్యామిలీ కార్డుల సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినటుల చెప్పారు. సర్వేలో తప్పులు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేని లే-అవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చేపట్టిన ఎల్ఆర్ఎస్ కింద జిల్లాలో 7,698 దరఖాస్తులు వచ్చాయని, రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపాలిటీ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అలాగే మంచిర్యాల కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. తెలంగాణ డిజిటల్ ఫ్యామిలీ కార్డుల సర్వేను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని, సర్వే చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతి లేని లే-అవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ కింద జిల్లాలో 55,392 దరఖాస్తులు వచ్చాయని, 1074 తిరస్కరించగా, 2,230 సంబంధిత భూములు నిషేధిత ప్రాంతాల్లో ఉన్నాయని, 987 అమోదించామని వివరించారు. ఈ వీసీలో ఆసిఫాబాద్ నుంచి అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ వినోద్ కుమార్, మంచిర్యాల నుంచి అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, జడ్పీ సీఈవో గణపతి, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, డీపీవో వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

దుస్తులు అందజేస్తున్న మహిళ తరంగిణి, మమత సభ్యులు

దుస్తులు అందజేత

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 1 : మంచిర్యాల మహిళా తరంగిణి, మమత తరంగిణి ఆధ్వర్యంలో సాయి దృష్టి అంధుల పాఠశాలలో మహిళలకు చీరలు, మానసిక వికలాంగురాలికి, ఒక అంధురాలికి దుస్తులు అందజేశారు. అనంతరం స్వీట్లు పంచారు. అధ్యక్షురాలు రాజకొండ మంజూలకృష్ణరావు మాట్లాడుతూ అంధులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగమణి, లత, భాగ్యలక్ష్మి, చిదానందకుమారి, జ్యోత్స్న, వాణి, శ్రీదేవి, వనజ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక శిబిరం 4.0

నస్పూర్, అక్టోబర్ 1 : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక శిబిరం 4.0 నిర్వహించనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా సంక్షేమాధికారి స్వరూపారాణి, కలెక్టరేట్ పరిపాలనా అధికారి రాజేశ్వర్, సఖి కేంద్రం సీఏ శ్రీలత, సిబ్బందితో కలిసి శిబిరం పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక శిబిరాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు కనీసం గంట సమయానికి తగ్గకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. శుభ్రతలో భాగంగా చెత్తను డంప్‌యార్డుకు తరలించాలని సూచించారు. మహిళల సంక్షేమం కోసం సఖి కేంద్రం సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బైపాస్‌దాడి ఘటనలో మరొకరి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 1 : బైపాస్‌రోడ్డులోని జగన్మోహన్ రావు ఇంటి వద్ద తన సూపర్‌వైజర్ ఆత్మకూరి సంజీవ్‌పై గతనెలలో జరిగిన దాడి ఘటనలో మరో వ్యక్తి బొక్కలగుట్ట శ్రీధర్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల సీఐ బన్సీలాల్ తెలిపారు. తన వద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకొని న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ దాడి కేసులో 18 మందిపై కేసు నమోదైయిందని, ఇప్పటికే పంగ శ్రీధర్, అన్నమయ్య, ప్రవీణ్ కుమార్, నగేశ్, శ్రీధర్, సంపత్, అజయ్, అన్వర్, షేక్ అబ్దుల్, రసూల్, రమేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసులో కీలకమైన గడప రాకేశ్, విశాల్‌ను త్వరలోనే పట్టుకొని న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తామని చెప్పారు. జిల్లా కేంద్రంలో గడప రాకేశ్‌కు చెందిన జిమ్ సెంటర్‌లో అసాంఘిక చర్యలు జరుగడంతో సీజ్ చేసినట్లు వెల్లడించారు.

బకాయిలను వెంటనే ఇప్పించాలి

శ్రీరాంపూర్, అక్టోబర్ 1 : సింగరేణి సంస్థకు విద్యుత్ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.33 వేల కోట్లను వెంటనే ఇప్పించాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గనిపై మంగళవారం డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ఎం సమ్మయ్యతో కలిసి మాట్లాడారు. వెంటనే సింగరేణి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏరియా కార్యదర్శి సంపత్, పిట్ కార్యదర్శి లక్ష్మణ్, రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఉత్పత్తి 61 శాతం

శ్రీరాంపూర్, అక్టోబర్ 1 : శ్రీరాంపూర్ ఏరియా గనులు, ఓసీపీల్లో సెప్టెంబర్ నెలలో 61 శాతం ఉత్పత్తి సాధించినట్లు జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జీఎం ఆఫీస్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 4.52 లక్షల టన్నులకు గాను, 2.77 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. భారీ వర్షాలతో సెప్టెంబర్ నెల ఉత్పత్తి వెనకబడిపోయిందన్నారు. భుగర్భ గనుల్లో 84 శాతం ఉత్పత్తి సాధించగా, ఓసీపీల్లో 52 శాతం సాధించామని తెలిపారు. ఎస్‌వోటూ జీఎం ఎన్ సత్యనారాయణ, డీవైజీఎంలు చిరంజీవులు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు

కౌటాల, అక్టోబర్ 1 : కౌటాల మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన నాగపురి శంకర్, నాగపురి సందీప్, నాగపురి పంకజ్‌కు హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున జరిమాన విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా అసిస్టెంట్ సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి యువరాజు మంగళవారం శిక్ష విధించినట్లు కౌటాల సీఐ రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గుండాయిపేట గ్రామానికి చెందిన ఎలుములే సాయిరాం అదే గ్రామానికి